నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

13 | హైదరాబాద్, గురువారం 1 ఫిబ్రవరి 2024 | HYDERABAD




దుర్గం చెరువు వద్ద పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్

## చెత్త వేసే ప్రాంతాలపై

# దృష్టి పెట్టండి

### వినియోగంలో లేని పబ్లిక్ టాయిలెట్లను తొలగించండి

### క్షేత్రస్థాయి పర్యటనలో జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్

సిటీబ్యూరో/మియాపూర్, జనవరి 31 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో దశల వారీగా తరచూ చెత్త వేసే ప్రాంతాలను తొలగించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని యూసుఫ్‌గూడ, శేరిలింగంపల్లి, చందానగర్, రామచంద్రాపూర్, పటాన్‌చెరూ సర్కిళ్లలో పారిశుధ్య పనులపై కమిషనర్ బుధవారం అధికారులతో కలిసి సమీక్షించారు. ఇంటింటి నుంచి సేకరించిన వ్యర్థాలను సమీప సెకండరీ ట్రాన్స్‌ఫర్ పాయింట్లకు తరలించడం, ప్రతి సర్కిల్‌లో తిరుగుతున్న వాహనాల సంఖ్య, సీ అండ్ డీ మెటీరియల్ లిఫ్ట్, ఎస్ఎఫ్ఏ సంఖ్య తదితర వివరాలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. గేటెడ్ కమ్యూనిటీల్లో చెత్తను సేకరించేందుకు వీలుగా డస్ట్ బిన్ ఏర్పాటు చేయాలని, వినియోగంలో లేని పబ్లిక్ టాయిలెట్లను తొలగించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు కమిషనర్ దుర్గం, చుట్టుపక్కల ఉన్న సరిహద్దు గోడ, నడక మార్గం మొదలైన ఇంజినీరింగ్, పారిశుధ్య పనులను పరిశీలించారు. జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, శానిటేషన్ విభాగం అదనపు కమిషనర్ ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యేందర్ వనం, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి తదితరులు

# కళలకు కాదేది అనర్హం

సుల్తాన్‌బజార్, జనవరి 31: నుమాయిష్‌లో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 83వ ఆలిండియా వార్షిక ఆర్ట్ ఎగ్జిబిషన్-2024ను ఎగ్జిబిషన్‌ను ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యేందర్ వనం, సొసైటీ కార్యదర్శి హన్మంతరావు, సంయుక్త కా ర్యదర్శి చందర్‌జిత్‌సింగ్, కోశాధికారి రాజేందర్‌కుమార్, హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి రాజేందర్ నాగులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. 'కళలకు కాదేది అనర్హం, చిత్ర కారుడి కుంచె నుంచి జాలువారిన ప్రతి చిత్రం ఓ అత్యద్భుతం' అని ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యేందర్ వనం అన్నారు. ఈ ఏడాది కూడా ప్రదర్శనలో మొత్తం 81 మంది కళాకారులు తమ చిత్రాలను ఏర్పాటు చేశారని, వీరిలో అత్యుత్తమ ప్రతిభ, ఆకట్టుకుంటున్న 21 చిత్రాలను ఎంపిక చేసి బహుమతులు అందజేసినట్లు హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ ఆర్ట్ ఎగ్జిబిషన్ సబ్ కమిటీ సలహాదారులు కవితా వనం, అశ్విన్ మార్గం, కన్వీనర్ హనుమంతరావు దేవులపల్లి, జాయింట్ కన్వీనర్లు ఉమారాణి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



## 'మెట్రో' మార్నింగ్ ఆఫర్

### కేబీఆర్‌లో వాకింగ్‌కు వెళ్లే వారికి 10 శాతం రాయితీ

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): కేబీఆర్ పార్కులో వాకింగ్ వెళ్లే వారికి ఎల్ అండ్ టీ మెట్రో ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 8 నుంచి 11.59 గంటల మధ్య మెట్రోలో ప్రయాణం చేసే వారికి నెబులా స్మార్ట్ కార్డుపై 10 శాతం రాయితీని ఇస్తున్నట్లు ప్రకటించింది. నగరంలో ఎక్కడి నుంచైనా మెట్రోలో బయలుదేరి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద దిగే వారికి సూపర్ పీక్ అవర్స్‌లో ఈ రాయితీని ఇస్తున్నట్లు మెట్రో అధికారులు తెలిపారు. ఉదయం, రాత్రి వేళ్లలో కేబీఆర్‌లో పార్కులో వాకింగ్ చేసే వారికి ప్రత్యేకంగా ఈ ఆఫర్‌ను వర్తింపజేస్తున్నామన్నారు.



## ముచ్చటగా మూడోసారి..

### జీహెచ్ఎంసీపై ఇన్‌చార్జి మంత్రి పొన్నం సమీక్ష వాయిదా

సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీపై హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష ముచ్చటగా మూడోసారి వాయిదా పడింది. గురువారం ఉదయం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఏడో అంతస్తులో సమీక్ష సమావేశం జరగాల్సి ఉండగా.. తదుపరి తేదీని చెబుతామంటూ మంత్రి కార్యాలయం.. జీహెచ్ఎంసీకి సమాచారం చేరవేసింది. అయితే అసలే ఉద్యోగులకు జీతాల చెల్లింపులు కష్టతరంగా మారింది. గతంలో ఎన్నడూ లేనంతగా ఆస్తిపన్ను వసూళ్లు గణనీయంగా తగ్గాయి. రాష్ట్ర బడ్జెట్‌లో జీహెచ్ఎంసీకి ఆర్థిక భరోసా దక్కుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇలా వివిధ అంశాలు సమీక్షతో ముడిపడి ఉండటంతో అధికారుల్లో సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

## నేటి నుంచి నర్సరీ మేళా

సిటీబ్యూరో: నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో నేటి నుంచి ఆలిండియా 15వ గ్రాండ్ నర్సరీ మేళా నిర్వహిస్తున్నట్లు మేళా ఇన్‌చార్జి ఖాలీద్ అహ్మద్ వెల్లడించారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ మేళాను గురువారం డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రారంభిస్తారన్నారు. ఈ ప్రదర్శనలో 160కు పైగా స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, రూ. 3 లక్షల నుంచి రూ. 16 లక్షల విలువైన మొక్కలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.



చిరు వ్యాపారాలను తొలగించిన బల్దియా సిబ్బంది

# సీఎం అలా.. బల్దియా ఇలా..

### కుమారి ఫుడ్‌స్టాల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ భరోసా

### దుర్గం చెరువు వద్ద చిరు వ్యాపారులపై జీహెచ్ఎంసీ కన్నెర్ర

### సమాచారం లేకుండా దుకాణాల తొలగింపు

### కమిషనర్ ఆదేశాల మేరకు తొలగించామన్న అధికారులు

కొండాపూర్/సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో అంతా గందరగోళమే అన్నదానికి బుధవారం చోటు చేసుకున్న పరిణామమే ఉదాహరణ. వీధి వ్యాపారుల విషయంలో బుధవారం ఒకే రోజు రెండు వినూత్న నిర్ణయాలు అన్ని వర్గాలను విస్మయానికి గురిచేశాయి. దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జి సమీపంలోని కోహినూర్ హోటల్ ఎదురుగా కుమారి అనే మహిళ నడుపుతున్న ఫుడ్‌స్టాల్‌తో తీవ్ర ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అక్కడి నుంచి తొలగించి.. మరో చోట పెట్టుకోవాలంటూ ట్రాఫిక్ పోలీసులు సూచించారు. సామాజిక మాధ్యమాల్లో విపరీతమైన క్రేజ్ ఉన్న కుమారి ఫుడ్‌స్టాల్‌కు మరుసటి రోజే స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండగా నిలుస్తూ..ఫుడ్‌స్టాల్ కొనసాగింపునకు అనుమతిచ్చారు. ఈ మేరకు డీజీపీతో పాటు మున్సిపల్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్ నిర్ణయంతో ట్రాఫిక్ పోలీసులు ఒకింత షాక్‌కు గురయ్యారు. ఇదిలా ఉంటే ఈ స్థలానికి కూతవేటు దూరంలో ఉన్న దుర్గం చెరువు నుంచి ఇనార్బిట్ మాల్ రోడ్‌లో దాదాపు మూడేండ్లుగా దాదాపు 25 మంది వరకు చిరు వ్యాపారులు జీవనం సాగిస్తున్నారు. తోపుడుబండ్లు, చిన్న చిన్న రేకుల షెడ్డులను ఏర్పాటు చేసుకొని ఆహార పదార్థాలు, టీ , ఇతర శీతల పానీయాలు, తినుబండారాలు వంటి వాటితో జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ చిరు వ్యాపారులపై కమిషనర్ కన్నెర్రజేశారు. దుర్గం చెరువు పర్యటన సందర్భంగా ఈ చిరు వ్యాపారాలను తొలగించాలని, లేదంటే సస్పెండ్ చేస్తానంటూ జోనల్ అధికారులను కమిషనర్ హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాలను అందుకున్న జోనల్ అధికారులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు రంగంలోకి దిగి తోపుడు బండ్లను తుక్కుతుక్కు చేశారు..చిన్నగా ఏర్పాటు చేసుకున్న రేకులను పూర్తిగా తొలగించారు. కనీసం ఈ ప్రాంతం నుంచి ఖాళీ చేసి వెళ్లిపోవాలని సూచించే సమయం కూడా ఇవ్వకుండా మూసి వేసి ఉన్న తోపుడుబండ్లను పూర్తిగా ధ్వంసం చేయడం ఏమిటని చిరువ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి కుమారికి అక్కడే వ్యాపారం చేసుకునేందుకు భరోసా ఇచ్చారని, జీహెచ్ఎంసీ కమిషనర్ మాత్రం చిరు వ్యాపారులపై ప్రతాపం చూపించారని మండిపడ్డారు.

### పొట్ట కొట్టింది ఎవరు?

హైదరాబాద్, జనవరి 31(నమస్తే తెలంగాణ): రోడ్డు వెంబడి చిన్న ఫుడ్ కోర్టు నడుపుకుంటున్న కుమారి హోటల్‌ను మూయించి ఆమె పొట్ట కొట్టింది ఎవరని బీఆర్ఎస్ నేత సతీశ్ రెడ్డి ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతున్నదని ఆమె హోటల్‌ను ట్రాఫిక్ పోలీసులు మూయించడం, అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించడం వెనుక అసలు కారణం ఏమిటని ఎక్స్ వేదికగా నిలదీశారు. అసలు కుమారి హోటల్‌ను మూసేసింది ఎవరు?, ఆమెపై కేసు పెట్టింది ఎవరు?, పబ్లిసిటీ చేసుకుంటున్నది ఎవరు?.. అని సతీశ్ రెడ్డి ప్రశ్నించారు.



## ఎంట్రీ చేసినం.. పైసలివ్వండి..

ఉప్పల్, జనవరి 31 : ప్రజాపాలన దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినా.. బిల్లులు చెల్లించడం లేదని ఆరోపిస్తూ సిబ్బంది బుధవారం నిరసన తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. తమకు రావాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

# అస్తవ్యస్తం..

## నగరంలో జఠిలంగా మారిన ట్రాఫిక్ సమస్య

### విజిబుల్ పోలీసింగ్ లేకపోవడమే ప్రధాన కారణం

### నెల రోజుల్లో రెండోసారి సమీక్షించిన సీఎం రేవంత్

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జనవరి 31 (నమస్తే తెలంగాణ): నిత్యం ట్రాఫిక్ జామ్‌తో నగరవాసులు అవస్థలు పడుతున్నారు. గంటల కొద్దీ ట్రాఫిక్ స్తంభించిపోతుండటంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. విజిబుల్ పోలీసింగ్ లేకపోవడంతోనే ఈ సమస్య తీవ్రమవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, అధికార యంత్రాంగం ట్రాఫిక్ సమస్యపై మల్లగుల్లాలు పడాల్సి వస్తున్నది. గత నెల రోజుల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి రెండు సార్లు నగర ట్రాఫిక్ సమస్యపై సమీక్ష నిర్వహించాల్సి వచ్చింది. కానీ సమస్య మాత్రం కొంతమేర కూడా పరిష్కారం కాలేదు.



### ట్రాఫిక్ జామ్‌లు..

నగరంలో ట్రాఫిక్ సమస్య వాహనదారులను వెంటాడుతున్నది. నగరవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు విసిగిపోతున్నారు. సమస్య పరిష్కారానికి అధికార యంత్రాంగంలోని ఉన్నతాధికారులు మల్లగుల్లాలు పడుతున్నా... క్షేత్రస్థాయిలో పరిష్కార మార్గాలు అమలు కావడం లేదు. సమస్య తీవ్రత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలో కొన్నిరోజుల కిందట సీఎం రేవంత్ ట్రాఫిక్ సమస్యపై ఆరా తీశారు. అసలు ట్రాఫిక్ జామ్‌లు ఎందుకు అవుతున్నాయి? పరిష్కారాన్ని చూడండి... అని పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందుకు అనుగుణంగా ఇటీవల బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో చర్చించారు. తదనంతరం పలు రకాల చర్యలు అమలులో కనిపించాయి. సైబరాబాద్ పరిధిలో భారీ వాహనాల రాకపోకలపై నిషేధ సమయాన్ని పొడిగించారు. ఉదయం ఏడున్నర నుంచి పదిన్నర వరకు ఉన్న సమయాన్ని పదకొండున్నర వరకు... సాయంత్రం నాలుగు నుంచి రాత్రి పది వరకు ఉంటే... పదిన్నర వరకు పొడిగించారు. దీంతో పాటు ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించడం వల్ల సమస్య కొంత మేరకు తీరుతుందని ఆ మేరకు చర్యలు చేపట్టారు. అయినా సమస్యలు పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదు.

### ప్రధాన కారణాలు..

నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రం కావడంతో పాటు పరిష్కారం కాకపోవడానికి పలు ప్రధాన కారణాలు ఉన్నాయనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇందులో ప్రధానంగా విజిబుల్ పోలీసింగ్ అనేది చాలా తగ్గిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పీక్ అవర్స్‌లో కొన్నిచోట్ల కనిపించినా... ఆ తర్వాత లేకపోవడంతో సాధారణ సమయాల్లోనూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నగరంలో ప్రధానంగా కొన్ని చోట్ల ట్రాఫిక్ జామ్ తీవ్రమై... దాని ప్రభావం చుట్టూ కిలోమీటర్ల మేర కనిపిస్తున్నది. దీనిపై సంబంధిత పోలీసు అధికారుల ఫోకస్ ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. తొలుత స్వల్పకాలిక పరిష్కారాలపై దృష్టిసారించి... ఆతర్వాత దీర్ఘకాలిక చర్యలకు ఉపక్రమిస్తే వాహనదారులకు కొంతమేర ఊరట కలుగుతుందని పలువురు సూచిస్తున్నారు.

## నేటి నుంచి ఉస్మానియాలో 'ఎంఆర్ఐ' నిలిపివేత

సుల్తాన్‌బజార్, జనవరి 31: ఉస్మానియా దవాఖానలో గురువారం నుంచి నాలుగు నెలల పాటు ఎంఆర్ఐ స్కాన్ పరీక్షలను నిలిపివేస్తున్నట్లు దవాఖాన వర్గాలు తెలిపాయి. వైద్యశాలలో ఇన్‌పేషెంట్లుగా ఉన్న రోగుల్లో అవసరమైన వారికి గాంధీ, ఎంఎన్‌జే దవాఖానల్లో ఎంఆర్ఐ స్కాన్ పరీక్షలు చేయనున్నారు. ఉస్మానియాలో 16 ఏండ్ల కిందట ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ యంత్రం శిథిలావస్థకు చేరింది. మరో నాలుగు నెలల్లో నూతన యంత్రం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని, అప్పటివరకు ఇన్‌పేషెంట్లు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ తెలిపారు.






# అందర్నీ మార్చేశారు

## చర్చనీయాంశమైన పంజాగుట్ట ఠాణా సిబ్బంది బదిలీ

### అవినీతిపరుల్లో మొదలైన గుబులు

సిటీబ్యూరో: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఒక ఠాణాలో పనిచేస్తున్న సిబ్బందినంతా ఒకే సారి బదిలీ చేయడం సంచలనంగా మారింది. ఈ చర్యతో అవినీతి అక్రమాలు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిలో గుబులు మొదలైంది. ఒక నాడు బెస్ట్ పోలీస్‌స్టేషన్‌గా ఉన్న పంజాగుట్ట ఠాణా నేడు ఆ ఖ్యాతి కోల్పోయింది. ఒక రోడ్డు ప్రమాదం నుంచి నిందితులను తప్పించేందుకు ప్రయత్నించిన ఇన్‌స్పెక్టర్ వ్యవహారంతో సిబ్బంది అవినీతి, అక్రమాల డొంకలు బయటపడుతున్నాయి. ఈ ఠాణాలో పనిచేస్తున్న ఎస్సై నుంచి హోంగార్డు వరకు 85 మందిని( బదిలీ అయిన వారిలో 6 గురు ఎస్సైలు, 8 మంది ఏఎస్సైలు, 16 మంది హెడ్ కానిస్టేబుల్స్, మిగతా వారు కానిస్టేబుళ్లు ఉన్నారు). ఒకే సారి పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి బుధవారం కార్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేయడం చర్చనీయాంశమైంది. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలనేది ప్రభుత్వాల లక్ష్యంగా ఉంటుంది. పోలీసుల్లో సగం మందికి పైగా డబ్బు సంపాదనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. పెట్రోలింగ్, బ్లూకోల్ట్స్ నుంచి కేసు దర్యాప్తు చేసే సెక్టార్ ఎస్సై, ఎస్‌హెచ్‌వో, కొందరు ఏసీపీలు సైతం ఈ అవినీతి అక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. పంజాగుట్టలో జరిగిన రోడ్డు ప్రమాదం ఘటన చిన్నదే అయినా, ఇన్‌స్పెక్టర్ ఈ విషయంలో అతి ఉత్సాహం ప్రదర్శించి డబ్బుకు దాసోహమయ్యారు. నిబంధనల ప్రకారం రోడ్డు ప్రమాదం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేయాల్సిన ఇన్‌స్పెక్టర్ దానిని కప్పి పుచ్చుతూ.. అమాయకుడిని నిందితుడిగా మార్చేందుకు ప్రయత్నించారు.

### అలముకున్న నిర్లక్ష్యం

నగర పోలీసుల్లో నిర్లక్ష్యం అలుముకున్నది. దీనికి తోడు అందినకాడికి సంపాదించాలనే ధ్యాస సిబ్బందిలో కనిపిస్తున్నది. కొందరు ఇన్‌స్పెక్టర్లు బార్లు, వైన్స్, పబ్బులు, హోటల్స్, లాడ్జీలు, ఫుట్‌పాత్ వ్యాపారుల నుంచే కాకుండా అక్రమ వ్యాపారాలు చేస్తున్న వారిని గుర్తించి.. వారి వద్ద నుంచి నెలవారీ మాముళ్లు వసూలు చేస్తున్నారు. ఇలాంటివి పంజాగుట్ట ఠాణా సిబ్బందిలో ఎక్కువగా ఉన్నట్లు పోలీసు ఉన్నతాధికారులు గుర్తించారు.

- ఒక్క పంజాగుట్టనే కాదు నార్త్ జోన్‌లో ఒక హత్య కేసులో అవినీతి ఆరోపణలు, నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు గోపాలపురం ఇన్‌స్పెక్టర్, ఎస్సైలను సైతం సీపీ సస్పెండ్ చేశారు.
- టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ వంటి స్పెషల్ విభాగాల్లోనూ అవినీతి, నిర్లక్ష్యం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.
- సిబ్బందిలో మార్పు రావాలంటే కఠినంగా ఉండాలనే..నగర పోలీస్ కమిషనర్ ఒకే సారి పంజాగుట్ట ఠాణా సిబ్బందిని మార్చేశారు. ఇది నగర పోలీస్ సిబ్బందికి ఒక హెచ్చరిక వంటిదే. తప్పు చేసిన వారిని శిక్షించడం, తప్పు చేయని వారికి రక్షణగా ఉండడమే పరమావధిగా పోలీసులు నీతి నిజాయతీతో పనిచేయాల్సిన అవసరమున్నదని నగర పోలీస్ కమిషనర్ గతంలోనూ సిబ్బందికి సూచనలు చేశారు.

## బస్సు బ్రేక్ ఫెయిల్

### ముగ్గురికి గాయాలు

హయత్‌నగర్: విజయవాడ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు బీభత్సం సృష్టించింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ తెలిపిన వివరాల ప్రకారం... దిల్‌సుఖ్‌నగర్‌కు డిపోకు చెందిన బస్సు చౌటుప్పల్ నుంచి బయలుదేరింది. విజయవాడ జాతీయ రహదారిపై హయత్‌నగర్‌లోని భాగ్యలత కాలనీ వద్ద బస్సు కింద శబ్ధం రావడంతో డ్రైవర్ ధర్మయ్య అప్రమత్తమై బ్రేక్ వేసినా..అదుపులోకి రాలేదు. వెంటనే హ్యాండ్ బ్రేక్‌ను వేయగా ముందు వెళ్తున్న రెండు ఆటోలు, రెండు బైక్‌లు, రెండు కార్లను ఢీకొట్టి నిలిచిపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ జగన్ తదితరులు పరిశీలించారు.

